# రెండు ముఖాలు

## ఒకటి

అడుగోనండీ, బయలుదేరాడు మహానుభావుడు!

ఆజానులాల్చీ, కళ్ళజోడు, చేతిలో కొత్త పుస్తకం, గజంగుడ్డ వేస్టు! ఎందుకంత పొడుగుచొక్కా? ఏదో "కాన్స్పిక్యుయస్" గా ఉండాలి. అంతే 'హిగింబాదమ్సు' చల్లగా ఉండాలిగాని కొత్త పుస్తకాల కేంలోటు? చదివేదీలేదు, అర్థమయ్యేదీలేదు

వట్టి పోజులు!

రష్యన్ కథలంటాడు, ఫ్రెంచినవల లంటాడు, ఇంగ్లండు కవిత్వంఅంటాడు, జర్మన్ విమర్శలంటాడు. ఎందుకా ఘోషలన్నీ? నోరుమూసుకు పడిఉండక. మనలా నేలమీద నడవడే! ఎంతసేపూ ఆకాశ విహారం! మనదగ్గరకి రాడు, మాటాడడు. పురుగుల్ని చూసినట్టు చూస్తాడు.

ఏడిశాడు-మనదగ్గర నోరుపెగలద్దూ? అక్కడా అక్కడా నోటి తడాఖాలు కొట్టినట్టు కాదు, మనతో ప్రసంగించడమంటే— అగ్నిపరీక్ష! కత్తులమీద సాము!

కొండొకచో—మాట్లాడాడా, కవిత్వం, చమత్కారాలు, అఘోరిస్తాడు; సూటిగా .... సాపుగా .... ఈవూరి రాజకీయాలు మాట్లాడమను, చూద్దాం, కాశ్మీరు యుద్ధంమాట, కలకత్తా గొడవలమాట తర్వాత చూసుకోవచ్చు—

గజం కోటాగుడ్డ, పంపు పంచదార, ఒక బస్సు టికెట్టు సంపాదించమను. తెలుస్తుంది వీడి కవిత్వం, ప్రగల్భాలూను.

ఎక్కడేనా సభ అంటూ తోరణం కట్టి భయం. మనవాడు సిద్ధం-ఎందుకూ? నోరుమూసుకుని ఊళ్లో పడిఉండక. ఈమాత్రం అవాకులు, చెవాకులు మాట్లాడలేకనేనా మనం వెళ్ళకపోతే? మనం ప్లాట్‌ఫారం ఎక్కితేనా....ఎదట నిలబడగలిగిన మగాడేడీ? మన వాగ్ధోరణికీ. ఇచ్చే 'ఇన్‌ఫర్‌మేషన్'కీ 'పండితులు తారెత్తి పరుగెచ్చుకోవాలి' బసవరాజు అన్నట్టు——

అన్నట్టు —— మనకి తైమెక్కడేడిసింది! ఈ ఊరినించి మనం ఒక్కగడియ కదిలితే.... ఈగ్రామ ప్రజ యావత్తు.... హడిలి ...బెంగెట్టుకు చచ్చిపోతుంది. పాపం! ఎందుకీ నరహత్య అని మనం .... అనగా మనపీఠం ఈ ఊరినించి కదలదు. అంతే కాదుటోయ్ కారణం?

ఒకమాటు పలకరించిచూశాం. పోనీపాపం.... అని

ముఖం గమ్మత్తుగాపెట్టి నవ్వి వెళ్ళిపోయాడు.

ఓరి వీడినవ్వు నాశనంకాను! నవ్వడానిక్కూడా మన సెలవుండాలని ఈపీనుక్కి తెలియదు గాబోలు! ఈనవ్వు గడియలో ఏడుపులోకి దింపెయ్యగలం .... బొత్తిగా ఏడ్చిపోతాడని ఊరుకున్నాం గాని....

ఇంతకూ....వీడు మనకు ఏమపకారం చేశాడూ అన్నది కాదు ప్రశ్న. వీడి ఆ ప్రత్యేకతఏమిటీ....అని మా విచికిత్స.

మనలో మనమాట. మొన్న చచ్చేటంత దెబ్బతీశాం. సిగ్గులేదుగాని.

వార్షికోత్సవ మహాసభలో వేదికమీదికి వీడు వచ్చాడండీ తగుదునమ్మా! అని. అప్పుడు ఆడియన్సు సుఖంగా వింటూన్నా సరే....నాలుగు మూలలనుంచీ 'దిగు దిగు' అని అరిచే ఏర్పాటు దిగ్విజయంగా చేశాం. ఊపిరాడనివ్వలేదు మానవుడికి....

వెంటనే ఉపన్యాసం అక్కడికే ముగించి, మీరు నా ప్రసంగం ఇంత శ్రద్ధగా విన్నందుకు కృతజ్ఞుణ్ణి'అని ఒకవిసురు విసిరి దిగిపోయాడు. దానితో మరొకడైతే-మంచం పట్టవలసిందే. కాని వీడు దులిపేశాడు. చింత చచ్చినా ...పులుపు చావలేదు.

కవిగాళ్ళది చింతపండు జాతి గాబోలు! నయం, ఈమాట వాడు వినలేదు. వింటే ఏమంటాడో తెలుసునా?

'ఈ రాగిచెంబు లోకాన్ని ఇంకెవరు బాగుచెయ్యగల'రని హ్యూమర్ అఘోరించేవాడు.

తలవంచుకుని రోడ్డుపక్క నడుస్తాడు. ఇది మనకు తలవంపులో, వాడికో.... తేలింది కాదు. మనకేం ఖర్మం? వాడికేలెండి!

ఎన్ని అవసరాలో స్త్రేమాత్రం మనం ఎప్పుడేనా వంచి ఎరుగుదుమా! సందులంట తిరుగుతాడేం? సర్కారువేసిన రాచబాట ఉండగా, అది పూర్తిగా మీకు వదిలిపెట్టానంటాడు గాబోలు: రాస్కెల్ —

వట్టి 'సినిక్'. ఒక్క స్నేహితుడు లేడు ఒక పెద్దమనిషి దగ్గరికి చేరనియ్యడు. కాఫీహోటేల్లో, క్లబ్బులో, ఒక్కడు పలకరించడు. పేకముక్కల పేర్లేనా చెప్పలేడు. కాని ఇన్నిఉన్నా

ఏమీ కించపడదే? సిగ్గులేదా? మనం ఉంచినదానికన్న ఎక్కువ దూరంలో ఉండి తృప్తిగా లోపల్లోపల నవ్వుకుని ... ఏ పుస్తకంలోనో కలిసిపోతాడు. ఆ నిర్లక్ష్యం చూస్తే అగ్గి ఎత్తుకొస్తుందా రాదా? నిజం చెప్పండి.

# రెండు

ఇక మొదలు.... విరగబడి వింతగా నావేపు చూడడానికి, సర్కసు జంతువును, కొత్తద్వీపంనుంచి వచ్చిన మనిషినిచూసినట్టు,

రెండేసి అవయవాలున్నాయా? తలకిందుగా నడుస్తున్నానా? నడిస్తే ఎంతబాగుండును! యువయోగి అని నాకు గుడిగట్టి డబ్బుచేసుకునేవారు పాపం-అందుకూ కొరగాని... కొరకరాని.... కాని నోటితీటతీరా 'స్కాండల్సు' మాటాడుకోడానికి మాత్రం తోడ్పడి ఉపకారం చేస్తూనేఉన్నాను. కాని....కసి? యుగయుగాలుగా మానవజాతిలో నిలిచి సభ్యత మాటుపడినప్పుడల్లా....పైకి విశృంఖలంగా వచ్చే క్రూరమృగ లక్షణాలు కాంద్రుమని బయటికి రాకమానవు. చిరునవ్వుల్లో, పందుమీసాల్లో, ఎంతకాలం దాచగలరు? పాపం వాళ్లూ మనుష్యులు!!

"మనుషుల్ని చూసిన వికారంపోవడానికి ఒకక్షణం పచ్చని చెట్లవేపు చూడమ"న్నాట్ట, ఆస్కార్ వైల్డు. అయితే చెట్లవేపే కాదు జంతువులవేపు చూసినా కొంతశాంతి చేకూరుతుంది.

మనుష్యులకన్న జంతువులు ఎంతనయం! నానాగడ్డీ మనుష్యులకు విడిచిపెట్టి....ఒక్కతృణంమాత్రంఅవి తింటాయి. మాటమాటకూ మనిషి పెద్దతెలివిగా "పశువులా ప్రవర్తించకు"

అంటాడు. పశువువింటే ఏమనుకుంటుందో అన్నజ్ఞానం లేదు గదా! పశువుభాషే అర్థమయితే మానవుడు ఎంత సిగ్గు పడేవాడో!

'ఏం మనిషిచేసిన పనులు నేనేంచేశాను? .... ఒకరిభార్యల నపహరించడం, రాజ్యంకోసం అన్నదమ్ములు నరుక్కు చావడం, స్నేహం నటించి తడిగుడ్డలతో సాటివారి గొంతుక కొయ్యడం, జాతులనీ, మతాలనీ, గళ్లుగీసుకొని, గుళ్లువేసుకొని, పరిధులు ఏర్పరచుకొని దొంగ పరిరంభాల్లో, విషపునవ్వుల్లో, లోలోన కుళ్ళడం పశుచరిత్రలో చూపించగలవా?

మాకు న్యాయస్థానాలు, విశ్వవిద్యాలయాలు, విజ్ఞాన కేంద్రాలు, లేవు కనుకనే మేం ఇప్పటికీ నిర్మలంగా బతుకు తున్నాం. ధైర్యంఉంటే మాతోరండి. ఆకుపచ్చని ప్రపంచంలో బతుకుదాం. లేదా- మీ ఇనపపట్టణాల్లో, నాగరికత మేలిముసుగుల్లో మూలుగుతూ కాలక్షేపం చెయ్యండి. మేమేంచెయ్యం? మీ దురదృష్టంఅది" అని పశువుతిరగబడి తనభాషలో అంటే!

ఈ మానవజాతికి ఎంత దూరంగా ఉండగలిగితే- అంత సంతోషిస్తాను ఎందుకీమర్యాదలు, చిరునవ్వులు, నమస్కారాలూ? వీటి ఏఒక్కటివెనకా మనిషిలేడు. ఆర్ద్రితలేని ఒక శుష్కభావం నిలిచిఉంది. వీటికి దూరంగా ఉంటానన్నందుకేనా నామీద ద్వేషం? వీటినిజంనేను తెలుసుకున్నాననేనా నన్నీ మానవులు వేటాడుతున్నది?—ఇవినాకిచ్చినవాడు నానుంచికూడా కోరుతున్నాడు. తీసుకోకా, ఇవ్వకా, దూరంగా ఉండడమేనా నాక్షమించరాని అపరాధం?-మానవుడు, ఒకడు ఒక సామ్రాజ్యం

సంపాదించుకున్నా.... లక్ష్యపెట్టకుండా ఊరుకుంటాడు గాని.... ఇంకొకడు చూపే "ఇండివిడ్యుయాలిటీ" మాత్రం చూసి సహించడు. ఇదీ జీవనరహస్యం!

ఈలోకంఅంతా ఒక హోలీపండుగలా ఉంది. ఎర్ర నీళ్లందరిచేతా పోయించుకోవాలి, నేనూ పొయ్యాలి, అప్పుడూ ఈలోకసంగీతానికి, నాకూ, శ్రుతి—సాయంత్రంక్లబ్బుకూ, రాత్రి కార్లితార్ సర్కసుకూ, ఉదయం గుళ్లో సప్తాహానికీ, వచ్చి తనివితీరా పక్కవాడితో "స్కాండల్సు" మాటాడితేనే నా మనుగడసార్థకం. అప్పుడే అందరికీనేను మిత్రుణ్ణి.

Avoid papularity, it has many snares and no real benifit' అన్నవాడు గట్టివాడు.... ఇట్లాఅని మనుష్యుల్ని ద్వేషించమనడంలేదు. పాపం! ద్వేషించదగిన గొప్పవిలువలు మాత్రం ఏమున్నాయి వీళ్లదగ్గర? వీరిలోని ఏసిద్ధాంతాన్ని ద్వేషించడం? ఏనిశ్చయాన్ని ప్రతిఘటించడం? వట్టి కాలవాదులు. ....లోపలికి చూసుకుంటే తమదీఅన్నది ఏదీ వీరికుండదు. అట్లా ఏదో ప్రత్యేకత ఉన్నదనేగా నామీదవిషం వీరికి—

ఇంతకన్నా "అన్‌పాప్యులర్" అయి పలకరించేవాడు లేక పోతే ఎన్నిపుస్తకాలు చదువుకోడానికి వీలయ్యేదో!

అంతర్ముఖుడికి రెండేరెండు పరమప్రియమైనవి గాబోలు! ఒకటి—తమశాంతశీతలచ్ఛాయల్ని విరజిమ్మి ఆదరించే అరణ్యసీమలూ, రెండూ— ఊహాతీతదివ్యప్రపంచంలో తిప్పి నిరంతరమంగళగానాన్ని వినిపించే మహాకవికావ్యమూను.

గంగా

# హృదయం

రెండుకంఠాల్నీ ఏకంచెయ్యడానికి ఎంత ప్రయత్నించాను? విఫల మయిపోయింది. నాలోఏదోభాగం చెడిపోయింది.

* * * * *

విశాలమైన మహాభవనంలో కూర్చున్నాను. శరీరంలేని మూడుధ్వనులు వినబడ్డాయి. చెప్పలేనంత భయంవేసింది. అవతల ఏమున్నదో అనకా....అర్ధమేమయినదీ తెలియకా....